ఈవారం కథ



కళ్లు ఇంతలు చేసుకుని చూసేడు విశ్వనాథం.
చిట్లిన వేణువు నుంచి రక్తం స్రవిస్తోంది.. ఆగకుండా..
అది ఇసుకలో యింక కుండా ధార కట్టింది.
ధార ఒక రక్తపొడ పాము లాగ సాగింది.
విశ్వనాథం భయంగా వెనక్కి అడుగులు వేశాడు.
ఆ ధార అతనికేసి సాగింది.

పూలతీగె కాళ్ళకు చుట్టుకుని కారెమబోతు ఆగిపోయినట్టు ఆ వేణునాదం విని విశ్వనాథం ఆగిపోయాడు.

జన ప్రవాహం పైనుంచి వంతెన, దానిమీద రైలుపట్టాలు.

వంతెన గోడ కానుకుని ఒక గుడ్డి మనిషి.

అతని బండ పెదవుల నానుకొని ఎప్పుడూ ఒక మురళి.

ఆ మురళీ రంధ్రాల నుంచి కాటుక పొగలై, సర్పాలై జరజర పాకివచ్చే పాటలు.

విశ్వనాథానికి మోటారు సైకిలు చప్పుడులో ఆ పాటలు ఎప్పుడూ వినిపించవు.

వంతెన పైనుంచి వెళ్ళిపోయే రైలూ ఆలకించదు.

వంతెన కిందనుంచి ప్రవహించే జనమూ ఆలకించదు.

మోటారు సైకిల్మీద వెళ్ళిపోయే విశ్వనాథం ఎన్నడూ వినలేదు.

గుడ్డివాడి పాటలు గరిక పూలై ఆ రోడ్డునిండా గుట్టలు గుట్టలైతే విశ్వనాథం వాటిని తొక్కుకుంటూ వెళ్ళిపోతాడు.

గుడ్డివాడి పాటలు సీతాకోకచిలకలై మబ్బుల్లాగ వీధినంతా ఆవరిస్తే విశ్వనాథం వాటిని చీల్చుకొని వెళ్ళిపోతాడు.

ఒక రోజు వంతెన దగ్గర అతని మోటారు సైకిల్ ఆగిపోయింది.

చీదరించుకుంటూ ఆ సైకిలుకు స్టాండు వేసి నిల్చున్నాడు.

పైనుంచి చండాలంగా చప్పుడు చేస్తూ ఇంజన్ ఒకటి వెళ్ళిపోయింది.

దూరంగా వున్న ఏదో చెట్టుమీద ఒక కోకిల "మ్యాసెప్ప్"గా కూస్తున్నది. దానికి తోడు

– ఈ గుడ్డి గాడిద కొడుకొకడు....ఫ్లూటు అంటారు గావోసు – ఖాకీ పేంటు జేబులోంచి అతను ఖాకీ సిగరెట్టు తీసి వెలిగించి ఖాకీ పొగ వదిలాడు. గుడ్డి మనిషి వేణువులోంచి ఒక పామొచ్చి విశ్వనాథాన్ని చటుక్కున కుట్టింది. ఉలిక్కిపడ్డాడతను.

– గుడ్డి లంజకొడుకు వాయిస్తున్నది ఏ పాట?

గద్దరుగాడి పాట!

అమ్మనాకొడక

నక్సలైటు నాకొడక–

దోపిడీ చెయ్యటం కాడ్నించి అడుక్కునే పన్లో కూడా మీరే దొచ్చుకుపోయేరన్నమాట.

విశ్వనాథం చరచర నడుస్తూ ముసలాడి దగ్గరకు వెళ్ళాడు.

"ఏంరోయ్....గుడ్డినాకొడకా...." అని పిలిచాడు.

గుడ్డిమనిషి అది వినలేదు.

"నీ పాటా పాడుతున్నమూ

నీ ఆటా ఆడుతున్నమూ...." అంటోంది మురళి.

వంగి అతని చేతిలోంచి మురళి లాక్కుందామనుకుని, – మనకి దేవుడిచ్చిన కాళ్ళుండగా చేతులెందుకు పాడుచేసుకోవాలి అనుకుని ఎర్ర బూటుతో ఆ మురళిని కదిపేడు.

ఆ బూటు మడమ గుడ్డిమనిషి గడ్డానికి తగిలింది.

గుడ్డికళ్ళ గుహల నుంచి చీకటి చిమ్ముకొచ్చింది.

అతను కంగారుగా భయంగా లేచి నిల్చున్నాడు.

చేయి ముందుకు చాస్తూ–

"ఎవరది.....ఎవరది....." అని పిరికిగా, భయంగా అన్నాడు.

"నీ అమ్మా మొగుడ్ని....గుడ్డి నాకొడకా...ఏం పాటలు పాడుతున్నావురా? కాళ్లేతులు విరిచీ గల్లు..."

గుడ్డి మనిషి నిజానికి పుట్టుగుడ్డి. వాడికి వెలుతురంటే తెలీదు. మనుషుల ఆకారం తెలీదు. జంతువుల ఆకారం తెలీదు. కాని కుక్కొస్తే, పోలీసొస్తే అతనికి ఎలాగో గాని తెలిసిపోతుంది. వచ్చినవాడు పోలీసని అతనికి తెలిసిపోయింది.

"పోలీసా?" అని అతను భయంగా అడిగాడు.

విశ్వనాథానికి అనుమానం గట్టిపడిపోయింది.

"నన్ను చూడగానే పోల్చేసేవు...అంటే నువ్వు నిజంగా గుడ్డోడివి కాదన్నమాట...." అన్నాడతను.

"చూడగానే కాదు బాబూ. నాకు చూపు లేదు. చప్పుడు బట్టి పోల్చేను...." అన్నాడు గుడ్డి మనిషి దండం పెడుతూ.

దండధారులు దండాలకి కొంత తగ్గుతారు. విశ్వనాథం తగ్గి – "నువ్వు అడుక్కుతినే నాకొడుకువు కాదా?" అని అడిగాడు.

"అడుక్కోను తండ్రీ! నేను ఈ ముర్లి వాయిస్తాను....దయగల తండ్రులు పావలా బేడా ఇస్తారు..."

"వాయించుగానీ...చక్కా దేవుడి పాటలుంటాయి అవి వాయించుకో....ఇలాంటి నక్సలైటు పాటలుగానీ పాడేవంటే చావదొబ్బుతాను" అన్నాడు విశ్వనాథం గుడ్డి మనిషి కంటిముందు చూపుడు వేలు ఆడిస్తూ.

గుడ్డి మనిషి మాట్లాడలేదు.

విశ్వనాథం అక్కడ్నుంచి ఒచ్చేసేడు.

మరో నాలుగు రోజులు పోయినతర్వాత ఆ దోవన వస్తుంటే ఆ గుడ్డి మనిషి మురళి వాయిస్తూండటం కనిపించింది.

– 'మన శిశువు ఏటి వాయిస్తున్నాడో చూద్దారి' అనుకుని అతను మోటార్ సైకిల్ ఆపుచేశాడు.

"దండూ దండూకు నేను ఎర్రజండనౌదు

భారతీ గిరియాల

కూలినాలన్నాలు

నా కూలీనాలన్నాలు

దండుక్షేరంగో

దండు దండుకు నేను ఎర్ర జండా నౌదు...

క్షతగాత్రంతో మురళి పాడుతోంది.

విశ్వనాథం పడగవిప్పాడు.

సైకిల్ స్టాండ్ వేసి, గుడ్డివాడి రెక్క పట్టుకొని ఆధాట్టున పైకి లేపేడు. వళ్ళంతా తూట్లుపడిన వెదురుముక్క కిందమట్టిలో పడిపోయింది.

"పదరా స్టేషన్కి....నీ గుడ్డికళ్ళు పీకేయకపోతే నేను పోలీసునై పుట్టలేదు...." అన్నాడు విశ్వనాథం.

గుడ్డికళ్ళనో, అందులో నుంచి చుంచెలుకల్లాగ తొంగి చూస్తున్న భయాలనో దాచడానికి అతని రెప్పలు రెక్కలు వాల్చేయి.

బండపెదాలు భయంగా రోకలి బండల్లాగ ముడుచుకున్నాయి.

"ఎందుకండి బాబు...." అన్నాడు గుడ్డి మనిషి

"మొన్న నీకేం చెప్పేన్రా?"

గుడ్డివాడు పెదాలతో గాలి మాత్రం వూదగలడు. అది మురళి గొంతులో మాత్రం శబ్దమౌతుంది. శక్తివంతమౌతుంది.

అందువల్ల అతనేమీ అనలేదు.

"దేవుడిపాటలు పాడమన్నానా లేదా?"

అని కోపంగా అడిగాడు విశ్వనాథం.

గుడ్డి మనిషి వెర్రినవ్వు నవ్వాడు.

విశ్వనాథం బుస్సుమన్నాడు.

"నేను సీరియస్గా అడుగుతుంటే నీకు నవ్వొస్తున్నాదిరా లంజకొడకా" అన్నాడు అతను

"పావల డబ్బులిచ్చి ఏ పాట పాడమంటే ఆ పాట తావండి" అన్నాడు గుడ్డి మనిషి చాలా మృదువుగా విశ్వనాథం చేయి విడిపించుకుంటూ.

"మరైతే నువు వాయిస్తున్న పాటకి డబ్బులు ఎవరిచ్చేరు.. మావో సేటుంగ్ ఇచ్చేడా? చారుమజుందారిచ్చేడా...నీ అమ్మా మొగుడిచ్చాడా? చెప్ప లంజకొడకా? ఏ లంజకొడుకు నీకు డబ్బులిచ్చి ఈ చెండాలపు పాటలు పాడిస్తున్నాడు..." అని చాలా కక్షగా అడిగాడు.

"ఈ పాటలు మంచియిగాదా తండ్రీ?" అని ఆ గుడ్డి మనిషి నెమ్మదిగా అడిగాడు.

"కాదమ్మా. నువు మంచి పాటలు పాడితే నేనెందుకు తిడతానమ్మా. నువ్వు శ్రీ వెంకటేశ ఈశా పాట వాయించు. గవర్నమెంటుతో మాటాడి నీకు భత్యం ఇప్పిస్తాను. మా పోలీస్స్టేషన్ ముందు కూచ్చుని రోజూ నువు దేవుడి పాటలు పాడు. నీకు ఎన్ని డబ్బులొస్తాయో చూసుకో. ఆ డబ్బులు పెట్టి నువ్వు చక్కా రిక్షా కొనుక్కోని ఊర్లోకి ఎక్కడబడితే అక్కడికి వెళ్ళి అడుక్కోవచ్చు. నీ బతుక్కి ఢోకా వుండదు. నీ మంచి కోరే నేనిదంతా చెబుతున్నాను....నువ్వు భలేగా వాయిస్తావు మురళి. అసలు మురళి దేవుడిది గదా. శ్రీకృష్ణుడిది. నువు దాన్ని తీసుకెళ్ళి గద్దర్గాడి చేతికిస్తే ఎలాగ?" అన్నాడు విశ్వనాథం.

"గద్దర్ ఎవరండీ?" అని గుడ్డి మనిషి అడిగాడు.

"వాడొకడున్నాడ్లే...తెలుసుకోవడం నీకు మంచిది కాదు...అసలు నీకా పాటలెలా గొచ్చురా?" అనడిగాడు విశ్వనాథం.

"మా మురికిపేటలో ఆలకించేనండి"

విశ్వనాథం తలూపాడు – "అదీ కథ.....అందుకే మురికి పేటలు లేకుండా చేసేయాలి. మురికంటే పెంట కదా? పేడ గదా? పేడంటే పత్తువ గదా. అక్కడ ఈ పాటలు నాటేస్తాయి. అసలు అందరూ మేడల్లో వుంటే ఈ డేంజరుండదు.. ."

నల్లని బండ పెదాలు సాగేయి. వాటి వెనక తెల్లని పల్వరుస మెరిసింది.

"అవును బాబూ...." అన్నాడు గుడ్డివాడు.

టివ్వి టివ్వి టివ్వి టివ్వి ట్విట్

టివ్వి టివ్వి టివ్వి ట్వీట్

అని అరుచుకుంటూ ఒక తీతిక ఎగిరిపోయింది.

"విన్నావా?" అన్నాడు విశ్వనాథం.

"అవునండి! తీతిక..." అన్నాడు గుడ్డి మనిషి కూర్చొంటూ.

"అదే....అన్నరు. నువు గద్దరుగాడంటే ఎవడని అడిగేవు గదా. గద్దర్ అంటే తీతిక..." అన్నాడు విశ్వనాథం.

"తీతిక కూస్తే ఎవరికో కీడు మూడిందంటారండి" అన్నాడు గుడ్డి మనిషి వేణువు కోసం తడుముతూ.

"అవును మరి అనకునం..."

"అంటే ఏ లంజకొడుకో సస్తాడన్నమాటే గదండీ" అన్నాడు గుడ్డి మనిషి దొరికిన వేణువును కుడిచేత్తో అందుకుని ఇసుక దులుపుతూ.

"అవునుగానీ నువు రఘురామయ్యగారి 'రామనీల మేఘశ్యామా' వాయించనా..."

"నాకు రాదండి"

"నేను నేర్పుతాను"

"నేర్పిస్తే రాదండి పాట....మనం ఇపీనరికి పాట మనల్ని తగులుకోవాలండి...అదండి పాటంటే. ఆ తీతిక పాట తగులుకుంటాదండి...." అన్నాడు మొద్దు పెదాలకి పేద వేణువు చేర్చుతూ.

"పోనీ నీకొచ్చిన పాట పాడు దేవుడి పాట" అన్నాడు విశ్వనాథం.

గుడ్డి మనిషి ఊపిరి పీల్చుకుని వూదటం ప్రారంభించాడు.

"వరెంక పెట్టు కింద వరుడో భాస్కరుడా

నువు కన్నెర చేస్తివయ్యా వరుడో భాస్కరుడా

బర్రెంక పెట్టుకింద వరుడో భాస్కరుడా

నువు బందూకు బడ్తివయ్యా వరుడో భాస్కరుడా

అని ప్రారంభించేడతను.

పాట అగరొత్తి పొగలాగ సాగుతోంది.

పాట మందార కొవలాగ ఊగుతోంది.

పాట రాతిగోడలోని మర్రి మొలకలాగ పెరుగుతోంది.

సగం అయ్యేసరికి విశ్వనాథానికి తెలిసిపోయింది.

గభాలున మురళి లాక్కున్నాడు.

"నిజం చెప్పు...నువు నక్సలైటువు కదూ?"

"నక్సలైటంటే ఏటి బాబూ?"

"నువు కమ్యూనిస్టువు గదూ?"

"కమ్యూనిస్టంటే ఏటి బాబూ?"

"ఏమీ కాకుంటే ఈ పాటలెందుకు పాడుతున్నావు..."

"అవంటే నాకిష్టం కాబట్టి...."

"ఎందుకని?"

"తెలీదు"

"నీకిష్టమైతే అయింది గానీ నాకు ఇష్టంలేదు. నువు మరోసారి పాడావో నరికేస్తాను. పెదాలు చీల్చేస్తాను జాగ్రత్త....నాకొడకల్లారా....నరికేస్తాను జాగ్రత్త...." అని కేకలేసి చేతిలోని మురళి నేలమీద పడేసి బూటు కాలితో తొక్కాడు.

బూటు కింద నలిగిన వేణువు చిట్లింది. దాని గాలి రంధ్రాల నుంచి ఇంత నెత్తురు కారింది.

కళ్ళు ఇంతలు చేసుకుని చూసేడు విశ్వనాథం.

చిట్లిన వేణువు నుంచి రక్తం స్రవిస్తోంది....ఆగకుండా....

అది ఇసుకలో ఇంకకుండా ధార కట్టింది.

ధార ఒక రక్తపాడ పాములాగ సాగింది.

విశ్వనాథం భయంగా వెనక్కి అడుగులు వేశాడు.

ఆ ధార అతనికేసి సాగిరిది.

అది అంతకంతకు పెద్దదయింది.

అతనికి దగ్గరయింది.

విశ్వనాథానికి భయమయింది.

గభాలున మోటారు సైకిల్ స్టార్టు చేశాడు.

స్టార్టు చేసిన సైకిల్ గుర్రంలాగ ఒక దూకు దూకింది.

పగపట్టిన పాములాగ ఆ నెత్తుటి ధార అతని వెంటపడింది.

అది సన్నగా మొదలై, బలపడి, వెడల్పయి, పెనువేగంతో పెరిగెడుతోంది.

ముందు విశ్వనాథం మోటారు సైకిల్, వెనకాల ఆ నెత్తుటి ప్రవాహం...పాములాగ అది అతన్ని వెంటాడుతోంది. చిట్లిన వేణువు అక్కడే వుండి నెత్తురు స్రవిస్తోంది. ●

(ఆంధ్రజ్యోతి వార పత్రిక 17, ఆగస్ట్ 1984 సంచిక నుంచి పునర్ముద్రితం)

వచ్చేవారం కథ

జ్ఞాపికలు

–చిలుకూరి దేవపుత్ర